## కచ్చేరీ

కోలాహలపు అలల మీద కవిత ఆడిటోరియం
అరటి దొన్నెలా తేలుతుంది.
కలకలాన్ని, హడావుడిని
కుచ్చుల తలపాగాలుగా చుట్టుకుని
ఆర్భాటాన్ని అతిశయాన్ని
పట్టుచీరలుగా కట్టుకుని
హాలంతా కళకళలాడుతుంది.
అంతలోనే
మొగ్గ విచ్చుకున్నంత నిశ్శబ్దం గా
తెర లేస్తుంది.
ఆమె వేలికొనలు సుతారంగా
తంబుర తీగల్ని తాకుతాయి
తృటిలో మెరుపు మెరిసినట్లు
నా చుట్టూ ఉన్న
రణగొణధ్వనుల ప్రపంచం
ఒక్కసారిగా అదృశ్యమవుతుంది.
ఏవో గాంధర్వలోకపు లోతుల్లోకి
నన్ను అలవోకగా విసిరేస్తూ
ఆమె ఆలాపన మొదలవుతుంది.
చికాకులనీ, బాధలని, బాధ్యతలనీ
ఒక్కటొక్కటిగా
ఓ రసానందపు అనుభూతి మరుగున పడవేస్తూ
ఆమె పాట అద్భుత తీరాల్లో నన్ను విహరింపజేస్తుంది!!
ఒక సుగంధద్రవ్యపు గాజుకుప్పె ఒలికినట్లు
గాఢమైన పరిమళం
నన్ను ఉద్విగ్నంగా చుట్టుముడుతుంది.
పాటకీ పాటకీ మధ్య విరామం
కంపిస్తున్న వాయిద్యమై
సంగీత సామ్రాజ్ఞి ముందు
వినమ్రంగా మునివేళ్ళమీద నిలబడుతుంది.
మధురమైన రాగాల వలలో
బందీనై చిక్కుకుని
కచ్చేరీ అయిన తర్వాత కూడా
నేను
ఓ రసప్రపంచం లో
పరవశంతో మిగిలిపోతాను.

**-- డా.వైదేహి శశిధర్**

## ఇంద్రజాలం

మిత్రమా!
చూడమంటూ నువ్వంపిన ఫైలు
తెరవబోతున్న క్షణంలో
తటాలున కిటికీ లో వెలిగిన తటిల్లత
ఆ వెంట గర్జించిన ఘన మేఘమాల!
కిటికీ అద్దానికి అటువైపు
వానచినుకుల దరువులు!
ఇటువేపు నేను, మంత్రముగ్ధనై!
నీ సరస పదకేళి
కన్నులతో ఆస్వాదిస్తుంటే
ఏటవాలుగా జాలువారుతున్న
జీవధారా రవళి నేపథ్యం లో
సుమధురగాన సభ
కళ్ళముందు సాక్షాత్కరించింది
నీకవితా గానంతో!!
అయ్యో, అప్పుడే ముగిసెనా
అనుకుంటూ కళ్ళెత్తి చూసాను.
ఆకాశం నాకేసి దృక్కులు సారించి
నవ్వుతోంది నిర్మలం గా.
ఇంద్రజాలమంటే ఇదేనంటూ.

(నా స్నేహితురాలు వైదేహి తను కొత్తగా రాసిన కవిత, కచ్చేరీ, --తానా సూవనీర్ లో ప్రచురించబడింది--నాకుపంపినపుడు అది చదువుతుంటే కలిగిన స్ఫూర్తితో రాసిన కవిత ఇది. నేను ఫైలు తెరుస్తుండగా మొదలయిన వాన చదవటం పూర్తయ్యేసరికి ఆగిపోయింది. ఆశ్చర్యం!!!) **-- నిడదవోలు మాలతి**